22052025-DIS-04_Layout 1 5/22/2025 1:58 AM Page 1



# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# విదేశీ వలసలు కఠినతరం

*ట్రంప్* రెండోసారి అమెరికా అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి వలసదారుల రాకను నియంత్రించడం లక్ష్యంగా పలు చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు. ఇవి అమెరికా వెళ్లిన, వెళ్లాలనుకునే భారతీయులకు తీవ్ర ఆందోళనను, ఇబ్బందులను కలిగిస్తున్నాయి. కొన్ని ఫర్మానాలను కోర్టులు కొట్టివేయడం, కొన్నింటిపై కేసులు నడుస్తుండటం తెలిసిందే. అమెరికా ఒక్కటే కాదు, కెనడా, బ్రిటన్ తదితర దేశాల్లోనూ వలసదారులకు వ్యతిరేకంగా రకరకాల నియంత్రణలు వెల్లువెత్తుతున్నాయి. విదేశీయుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా బ్రిటన్ తెస్తున్న ఈ నిబంధనల కారణంగా భారత్ వంటి వర్ధమాన దేశాల నుంచి అక్కడికి వెళ్లి చదువుకోవడం, ఉద్యోగాల్లో చేరడం గగనమైపోతున్నది. ఇదివరకు పర్మినెంట్ రెసిడెన్స్ కోసం ఐదేండ్లు బ్రిటన్‌లో ఉండాలన్న నిబంధన ఉండేది. తాజాగా ఈ గడువును పదేండ్లకు పెంచడం గమనార్హం.

స్థానికులకు విదేశీయులు ఉద్యోగావకాశాలు లేకుండా చేస్తున్నారనే అక్కసు అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యక్తమవుతున్నది. ఇలాంటి భయాలను సొమ్ము చేసుకునేందుకే అమెరికా అధ్యక్షుడు 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' (మాగా) అంటూ ఊదరగొడుతున్నారు. భారతీయులకు పొగబెట్టడమే కాకుండా యాపిల్ వంటి బహుళజాతి కంపెనీలు ఇండియాలో పెట్టుబడులు పెట్టకుండా అడ్డుకునే స్థాయికి ఆయన వెళ్తున్నారు. అమెరికా అయినా, బ్రిటన్ అయినా తమ స్వప్రయోజనాలకే పెద్దపీట వేస్తాయనేది నిర్వివాదాంశం. ఇప్పటివరకు సంపన్న దేశాలు వలసలను ప్రోత్సహించడానికి ఆయా దేశాల్లో జనాభా తక్కువగా ఉండటం, పారిశ్రామిక విస్తరణకు శ్రామికశక్తి అవసరం కావడం వంటి కారణాలుండేవి. అక్కడి కరెన్సీకి అధిక విలువ ఉండటం వల్ల వర్ధమాన, పేద దేశాల నుంచి ఎక్కువ మంది వలస పోయేవారు. ఐటీ యుగం రాకతో ఇవి తారస్థాయికి చేరాయి. 1990లో అంతర్జాతీయ వలసదారులు 15 కోట్లు ఉంటే 2024లో ఆ సంఖ్య 30 కోట్లకు చేరుకున్నది. ఇటీవలి దశాబ్దాల్లో ఈ ధోరణి తగ్గుముఖం పడుతున్నది. జాతీయవాదులు తాము ఎదుర్కొంటున్న సమస్యలకు వలసదారులను బూచిగా భావించే సంస్కృతి విస్తరిస్తున్నది. దీని ఫలితంగా సంపన్న దేశాల్లో వలస వ్యతిరేక విధానాలు పుట్టుకొస్తున్నాయి.

ప్రపంచం ఇప్పుడు మూలమలుపులో నిలిచింది. వలసల గురించి సహజంగానే పునరాలోచన జరుగుతున్నది. 2026 ఆర్థిక సంవత్సరానికి అమెరికా వీసా దరఖాస్తుల సంఖ్య గత ఏడాదికంటే 25 శాతం తగ్గినట్టు అమెరికా వలసల విభాగం విడుదల చేసిన గణాంకాల ద్వారా తెలుస్తున్నది. మరోవైపు దరఖాస్తుల తిరస్కరణ కూడా భారీగా పెరగడం విశేషం. దేశంలో అత్యధికంగా విద్యార్థులను అమెరికాకు పంపే తెలంగాణ, ఏపీ రాష్ర్టాల దరఖాస్తుల్లో సగానికి పైగా తిరస్కారానికి గురయ్యాయి. వీసా కోసం లక్షల్లో పెట్టిన ఖర్చు బూడిదలో పోసిన పన్నీరవుతున్నది. దీంతో సంపన్న దేశాలకు వలసపోయి కష్టాలు పడే బదులు 'జననీ జన్మభూమిశ్చ' అనుకొని ఇక్కడే ఉండిపోయి ఉపాధి చూసుకుంటే సొంతానికి, దేశానికి మేలు జరుగుతుందనడంలో సందేహం లేదు. 'మేక్ ఇండియా గ్రేట్' అనుకొని రూ.5 లక్షల కోట్ల ఆర్థికవ్యవస్థ నిర్మాణంలో పాలుపంచుకుంటే మరీ మంచిది.

# ఉద్యోగులపై ప్రభుత్వం పైశాచిక దాడి

**రాష్ట్రంలో ఉద్యోగ, పెన్షనర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అధికారంలోకి రాగానే ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించింది. అందుకనుగుణంగా మ్యానిఫెస్టోలో కరువు భత్యం, పీఆర్సీ, సీపీఎస్ రద్దు, 317 జీవో సవరణ చేస్తామని హామీలు ఇచ్చింది. అయితే దాదాపు ఏడాదిన్నర కావస్తున్నా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. ప్రొఫెసర్ కోదండరాంతో పాటు ప్రణాళిక సంఘం చైర్మన్ చిన్నారెడ్డి ఉద్యోగుల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిస్తారని రేవంత్ రెడ్డి ప్రకటించడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వారికి తమ సమస్యలు నివేదించారు. కానీ, ఒక్క అడుగు ముందుకుపడకపోగా, 12 నెలలు గడిచినా ఎలాంటి పురోగతి లేదు.**



జి.దేవీప్రసాద్ రావు
90006 33404



ఉద్యోగ సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న సందర్భంలో ముఖ్యమంత్రి పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశం జరిపారు. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా సమస్యల పరిష్కారం కోసం కొంత సమయం ఇవ్వాలని, మార్చి 25 తర్వాత ఆర్థిక డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇతర ఆర్థికేతర డిమాండ్లపై ఉద్యోగులతో చర్చలు జరుపడానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు ఇద్దరు మంత్రులతో కమిటీ వేస్తున్నట్టు ప్రకటించారు. కొత్తగా కమిటీలో ప్రభుత్వ సలహాదారుగా ఉన్న కేశవరావును సభ్యులుగా చేర్చారు. (కోదండరాం, చిన్నారెడ్డి ఇద్దరూ మాయమైపోయారు) అప్పటికీ పెండింగ్‌లో ఉన్న 3 కరువు భత్యాలకు ఒకటి మాత్రమే ఇస్తామని, సర్దుకోవాలని చెప్పి సమావేశం ముగించారు. అక్టోబర్ 24 నుంచి 6 నెలల పాటు మంత్రుల కమిటీ సమావేశం జరుగుతుందని ఎదురుచూసినా నిరాశే మిగిలింది.

ప్రాథమిక సభ్యుల ఒత్తిడితో 2025, మేలో ఉద్యోగుల జేఏసీ విస్తృత సమావేశం ఏర్పాటుచేసి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ దశలవారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఉద్యోగుల ఆందోళన కార్యక్రమాలపై ముఖ్యమంత్రి స్పందించిన తీరు తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నదని పెద్ద ఎత్తున ఉద్యోగులు నిరసన తెలిపారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేదని, 'నన్ను కోసుకొని తింటరా' అని చెప్పి ప్రజా సంక్షేమ పథకాలేవి ఆపాలో ఉద్యోగులు చెప్పాలని కోరారు. ప్రజల నుంచి ఉద్యోగులను వేరు చేసే విధంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడం దారుణం. ఉద్యోగులు ఆందోళన చేయకుండా 2 గంటలు ఎక్కువ సేపు పనిచేసి నిరసన తెలపాలని ఉచిత సలహా ఇచ్చారు. ఇతర దేశాల్లో ఇదే పద్ధతి కొనసాగిస్తున్నారని ప్రకటించారు. కానీ, 'ఈడీ కేసులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ వంటి నాయకులను వేధిస్తున్నారని మంత్రులు, నాయకులు ధర్నా నిర్వహించారు. ధర్నా చేయకుండా 2 గంటలు పారిశుద్ధ్య కార్మికులు చేసే పనిచేసి ఉండవచ్చు కదా' అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ ఆర్థికపరమైన డిమాండ్ల కోసం పట్టుబడితే 1వ తేదీన వచ్చే జీతం కూడా రాదని తేల్చేశారు. ఎవరూ మాట్లాడకుండా ముందుగానే సంఘాల నోళ్లు మూయించడానికి ప్రయత్నించారు.

సీఎం మాట్లాడిన తీరుపై సర్వత్రా విమర్శల జడివాన కొనసాగింది. దిద్దుబాటు చర్యల్లో భాగంగానే అధికారులతో కమిటీ ఏర్పాటు చేసినట్టు ప్రకటించి వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సహజంగానే ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీతో సమావేశం నిర్వహించి సమస్యలు మళ్లీ నివేదించారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి మంత్రుల కమిటీ పరిష్కరించని సమస్యలను అధికారుల కమిటీ పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నదని చెప్పడం హాస్యాస్పదం. 'ముఖ్యమంత్రి స్వయంగా బహిరంగంగా తాను పరిష్కరించలేనని స్పష్టం చేసిన తర్వాత.. అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం వీలవుతుందా' అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. డిమాండ్లు తీరకుండానే దశలవారీ ఆందోళన వాయిదా వేసుకొని అధికారుల కమిటీ నివేదిక కోసం ఉద్యోగ సంఘాలు ఎదురుచూడటం విషాదం.

**ఉద్యోగులు ఆందోళన చేయకుండా 2 గంటలు ఎక్కువ సేపు పనిచేసి నిరసన తెలపాలని ఉచిత సలహా ఇచ్చారు. ఇతర దేశాల్లో ఇదే పద్ధతి కొనసాగిస్తున్నారని ప్రకటించారు. కానీ, 'ఈడీ కేసులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ వంటి నాయకులను వేధిస్తున్నారని మంత్రులు, నాయకులు ధర్నా నిర్వహించారు. ధర్నా చేయకుండా 2 గంటలు పారిశుద్ధ్య కార్మికులు చేసే పనిచేసి ఉండవచ్చు కదా' అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.**

**మొత్తం 57 డిమాండ్లలో దాదాపు 45 ఆర్థికేతర అంశాలున్నాయని ఉద్యోగులు చెప్తున్నారు. దేశంలోనే 5 డీఏలు పెండింగ్ ఉన్న రెండు రాష్ర్టాల్లో తెలంగాణ ఉండటం ప్రభుత్వ వైఫల్యం కాదా? గత ప్రభుత్వంలో 3 డీఏలు పెండింగ్‌లో ఉండగా అందులో ఒక డీఏ ఇవ్వడానికి క్యాబినెట్ తీర్మానం చేసి ఎన్నికల కమిషన్ అనుమతి కోసం వేచి చూసింది.**

కానీ, అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎన్నికల తర్వాత విడుదల చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చింది. గత ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోయిన డీఏ ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. దీనికి తోడు గత 17 నెలల్లో 4 డీఏలు కేంద్రం విడుదల చేయడంతో మళ్లీ పెండింగ్‌లో 5 డీఏలు ఉన్నాయి. ప్రతి ఉద్యోగి తమ వేతనంలో నెలకు దాదాపు రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు కోల్పోతున్నారు. రెండవ ముఖ్య డిమాండ్ పీఆర్సీ అమలు. జూలై 23 నుంచి అమలు కావాల్సిన పీఆర్సీపై గత ప్రభుత్వం కమిటీ వేసింది. పీఆర్సీ ఆలస్యమైన పక్షంలో ఇవ్వవలసిన మధ్యంతర భృతి (ఐఆర్) 5 శాతం పీఆర్సీ ఏర్పాటుతో కేసీఆర్ ప్రకటించడం దేశ చరిత్రలో తొలిసారి. 17 నెలలుగా పీఆర్సీపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు, సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి కనీసం కమిటీ కూడా వేయలేదు. 317 జీవో సవరిస్తామని చెప్పి చేతులు దులుపుకొన్నారు.

మరో ముఖ్యమైన సమస్య 3/24 నుంచి రిటైరైన ఉద్యోగులకు రావలసిన ప్రయోజనాలు జీవితం చివరి దశ అవసరాల కోసం దాచుకున్న జీపీఎఫ్ మొత్తం కూడా ఇవ్వకుండా 12 వేల కుటుంబాలను వేధిస్తున్నది. ప్రతి నెల రిటైర్‌మెంట్ సంఖ్య పెరుగుతూనే ఉన్నది. రూ.8 వేల కోట్ల మొత్తం బిల్లులు ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్నాయి. నెలకు రూ.300-400 కోట్లు విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం కనీసం రూ.100 కోట్లు అయినా విడుదల చేయడం లేదు. చివరికి ఆరోగ్య కార్డుల విషయంలోనూ నిర్ణయం తీసుకోకపోవడం ఉద్యోగుల పట్ల ఉన్న వ్యతిరేకతను తెలియజేస్తున్నది. ఆశ, అంగన్వాడీ ఉద్యోగుల వేతనాలు పెంపు చేస్తామని చెప్పి మోసం చేశారని, ఉద్యోగులు డైరెక్టర్ కార్యాలయానికి వస్తే లాఠీఛార్జ్ చేయడమే కాకుండా అరెస్టులు చేసి ప్రజాపాలనకు రక్తంతో మెరుగులు దిద్దడం దుర్మార్గం కాదా? నెలలో 1వ తేదీ వేతనం ఇస్తున్నామని చెప్తున్నా వేల మంది ఉద్యోగులు నెలల తరబడి జీతాలు రాలేదనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోంగార్డులు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్‌లలో పనిచేస్తున్న లక్షల మంది ఉద్యోగులు వేతనాలు నెలల తరబడి ఆలస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేసీఆర్ ప్రభుత్వం రెండు పీఆర్సీలు 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి ఉద్యోగులను సంతృప్తిపరిచే విధంగా వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం చరిత్ర. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఫిట్‌మెంట్ ఇవ్వడం వంటి చర్యలు తీసుకోవడం ఉద్యోగుల పట్ల కేసీఆర్‌కు ఉన్న గౌరవాన్ని తెలిపింది. అంతేకాదు, కేసీఆర్ ప్రభుత్వం 2019 వరకు మొదటి తారీఖున జీతాలు ఇచ్చింది. కరోనా మహమ్మారి వల్ల, దేశవ్యాప్తంగా ఆర్థికమాంద్యం ఏర్పడి ఆలస్యమైంది తప్ప ఏనాడూ ఉద్యోగుల ప్రయోజనాలు ఇవ్వకుండా ఆపలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పూర్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సమన్వయ కమిటీ ఏర్పాటుచేసి రాజకీయాలకతీతంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం సామాజిక బాధ్యతగా గుర్తించి ముందుకువస్తే కాంగ్రెస్ నాయకులు ఎదురుదాడి చేయడం అమానుషం.

**ఉద్యోగ సంఘాలకు వ్యతిరేకంగా సమన్వయ కమిటీ అని కొందరు దుష్ప్రచారం చేయడం బాధాకరం. ఉద్యోగ సంఘాలు చేస్తున్న పోరాటం బలోపేతం చేయడానికే సమన్వయ కమిటీ సుదీర్ఘకాలంగా ఉద్యోగ సంఘాల నిర్మాణంలో పనిచేసి అద్భుతమైన పోరాటాలు చేసిన నాయకులపై బురద చల్లడం సరి కాదు. టీఎన్జీవో ఉద్యోగుల సంఘం చరిత్రలో ఎన్నడూ ప్రభుత్వాలకు లొంగకుండా, ఉద్యోగుల ప్రయోజనాలకే పనిచేసిందనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.**

అధికారుల కమిటీ నివేదిక ఇవ్వకుండానే 45 సమస్యలు పరిష్కరించామని అధికార పార్టీ విప్ ప్రకటించడం విడ్డూరం. రాజకీయంగా ఉద్యోగులను విభజించడానికి బీఆర్ఎస్ పార్టీ ప్రయత్నిస్తున్నదని విమర్శించడం అర్థ రహితం. అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం కావడం వల్ల ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికి ప్రజలు, ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేయడం సరికాదు. తెలంగాణ రాష్ట్ర సాధనలో వీరోచిత పోరాటం చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి హేయనీయం. ఈ ఆందోళనను దూరం చేయడానికి ప్రభుత్వం వెంటనే ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు జరపాలి. జూన్ 2 వరకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేయాలి.

**(వ్యాసకర్త: పూర్వ ఉద్యోగ సంఘాల నాయకులు)**

# కాళేశ్వరంపై ఇంత కంటగింపా?

**కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవధార. దేశంలో ఏ ప్రాజెక్టు తీసుకున్నా లోపాలు తలెత్తడం సహజం. వాటిని సరిదిద్దుతూ ముందుకువెళ్లాలి. తద్వారా సాగు, తాగునీటి ఫలాలు అందుతాయి. ప్రపంచంలో అనేక నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో ఇలాగే జరుగుతున్నది. ప్రాజెక్టులు ప్రారంభించిన పదేండ్లలోపు మరమ్మతులకు గురవడం సాధారణ విషయం. చిన్న సర్దుబాట్ల నుంచి గణనీయమైన మరమ్మతులు రావడం సహజమే. నేల కోత, నిర్మాణ, కాలక్రమేణా తలెత్తే సమస్యల కారణంగా ఈ మరమ్మతులు అవసరమవుతాయి.**



డాక్టర్ ఎర్రోజు శ్రీనివాస్



తెలంగాణకు ఎత్తిపోతల పథకాలు తప్ప మరో మార్గం లేదు. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకులో ఒక పియర్ (పిల్లర్) కుంగిన విషయాన్ని నాటి ప్రభుత్వాన్ని రాజకీయంగా దెబ్బతీసేందుకు అప్పటి ప్రతిపక్షాలు వాడుకున్నాయి. ఏ ప్రభుత్వమైనా ప్రజల ప్రయోజనాల కోసమే పనిచేయాలి. కానీ, కొత్తగా ఏర్పడ్డ రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకుండా తాత్సారం చేస్తూ ప్రజల ప్రయోజనాలతో ఆటలాడుతున్నది. మేడిగడ్డ పిల్లర్ కుంగింది. కానీ సుందిళ్ల, అన్నారం, బాగానే ఉన్నాయి కదా, వాటిని నింపి రైతులకు నీళ్లు ఎందుకు ఇవ్వడం లేదని సాగునీటిరంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. మేడిగడ్డ లోపాన్ని కారణంగా చూపెట్టి నీటిని ఎత్తిపోయకుండా 18 నెలలుగా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ఈ ఏడాది ఎండాకాలంలో తాగు, సాగునీటి కష్టాలు తలెత్తాయి. చేతికొచ్చిన పంటలు ఎండిపోయాయి.


అసెంబ్లీ ఎన్నికల సమయంలో పిల్లర్ కుంగుబాటుకు సరైన కారణాలు తెలుసుకోకుండానే మధ్యంతర నివేదిక ఇచ్చిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) పూర్తి నివేదిక ఇవ్వడానికి తీవ్ర కాలయాపన చేసింది. ఇటీవల ఎన్డీఎస్ఏ నివేదికలోనూ ఎక్కడా బ్యారేజీలు పనికిరావని లేదు. కానీ, ప్రభుత్వమే అలా ప్రచారం చేస్తున్నదనే ఆరోపణలు వినవస్తున్నాయి. కాళేశ్వరంపై ఎన్నికల వేళ ఒక వర్గం చేసిన విష ప్రచారాన్నే ఇప్పటికీ కొనసాగిస్తున్నది.

కాళేశ్వరం విషయంలో ఒక రకంగా, ఇతర ప్రాజెక్టుల విషయంలో మరో రకంగా వ్యవహరిస్తూ జాతీయ పార్టీలు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయనే విమర్శ ఉన్నది. ఎందుకంటే ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జరిగినప్పుడు, సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని చూస్తే ఇది స్పష్టమవుతుంది. మేడిగడ్డ నిర్మాణం లోపభూయిష్టమని, డిజైన్లు సరిగ్గా లేవని, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ ఎంక్వైరీకి ఆదేశించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ కూడా కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ఎస్ఎల్‌బీసీ, సుంకిశాల రిటైనింగ్ వాల్ ప్రమాదాలపై ఎందుకు ఎంక్వైరీకి ఆదేశించడం లేదని పౌర సమాజం ప్రశ్నిస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయాలను కమిషన్ కోరినప్పుడు.. ఎన్డీఎస్ఏ నివేదిక త్వరగా వచ్చేలా, ఈ లోగా దెబ్బతిన్న పియర్‌కు మరమ్మతులు చేసి, రైతులకు సాగు నీరు ఇవ్వాలని తెలంగాణ వికాస సమితితోపాటు మరికొంత మంది జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు విన్నవించారు. ఆ అభ్యర్థనలను పరిశీలించినట్టే కనిపించడం లేదు.

2020-2023 వరకు ప్రతి యాసంగి సీజన్‌లో లోయర్ మానేరు డ్యాం దిగువన ఉన్న శ్రీరాం సాగర్ ప్రాజెక్టు స్టేజీ-1, స్టేజీ- 2 ఆయకట్టు 10 లక్షలకు పైగా ఎకరాలకు సాగునీటి భరోసానిచ్చింది కాళేశ్వరం ప్రాజెక్టు. డిసెంబర్ నుంచి మార్చి నెలాఖరు వరకు కాకతీయ కాలువ నిండుకుండలా కనిపించడం రైతుల అనుభవంలో ఉన్నది. మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు మీదుగా కాళేశ్వరం నీళ్లు లోయర్ మానేరును దాటుకొని వందలాది కిలోమీటర్లు పరుగులు పెట్టాయి. దాని ఫలితంగానే వరి ఉత్పత్తిలో గత రికార్డులను తెలంగాణ అధిగమించింది. కానీ, కాళేశ్వరంపై ఆరోపణలు చేస్తున్న రేవంత్ సర్కార్ ఆ ప్రాజెక్టుతో పని లేకుండానే ఎస్సారెస్పీ స్టేజీ- 1, స్టేజీ- 2 ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీళ్లు ఇస్తామని చెప్పి పంటలు చేతికొచ్చే ముందు చేతులెత్తేసింది. ప్రభుత్వమే ప్రజల పక్షాన చొరవ తీసుకొని సత్వరమే మరమ్మతులు పూర్తిచేసి రాబోయే సీజన్‌లోనైనా పంట పొలాలకు నీళ్లు ఇవ్వాలి.

ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారం భూ సాంకేతిక, భూ భౌతిక పరిశోధనలు చేసేందుకు కనీసం రెండేండ్ల సమయం పడుతుంది. ఆ తర్వాత నివేదిక రూపొందించేందుకు ఆరు నెలలు, అనంతరం మరమ్మతులు చేసేందుకు మరికొంత సమయం పడుతుంది. ఈ లెక్కన రాబోయే మూడేండ్ల పాటు కాళేశ్వరం నీటిని వినియోగించుకునే అవకాశం లేదు. పరిశోధనలు, నివేదిక, మరమ్మతులకు ఎంత సమయం పడుతుందనే విషయమై ప్రభుత్వానికి ఒక అంచనా ఉన్నదా? ఉద్దేశపూర్వకంగానే మూడేండ్ల పాటు తెలంగాణను ఎండబెట్టాలని సర్కారు నిర్ణయించిందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఆరున్నర దశాబ్దాల పాటు గోదావరి జలాలను సముద్రంపాలు, ఆంధ్రాపాలు చేసినట్టుగానే.. ఈ ప్రభుత్వం ఉన్నంతకాలం గోదావరి నీటిని వారికే మలపదలుచుకున్నట్టు కనిపిస్తున్నది. కాళేశ్వరంలోని మూడు బ్యారేజీల నిర్మాణ పనులు 2016లో ప్రారంభమై 2019లో పూర్తయ్యా యి. అంటే బ్యారేజీల నిర్మాణానికి పట్టిన కాలం మూడేండ్లు. కానీ, మూడు పిల్లర్లను పునరుద్ధరించడానికి ప్రభుత్వం ఐదేండ్ల సమయం తీసుకుంటుండటం హాస్యాస్పదం.

**(వ్యాసకర్త: తెలంగాణ వికాస సమితి)**




# వీసా హక్కు కాదు!



**ఇప్పటివరకు ఎన్ని వీసాలు రద్దు చేశామనే లెక్క కచ్చితంగా నాకూ తెలియదు. కానీ, భవిష్యత్తులోనూ ఇది కొనసాగుతుంది. అమెరికాకు అతిథులుగా వచ్చి, నిబంధనలను ఉల్లంఘించి, ఇక్కడి ఉన్నత విద్యా వసతులను నాశనం చేస్తామంటే మాత్రం చూస్తూ ఊరుకోం. అటువంటి వ్యక్తుల వీసాలు రద్దు చేస్తూనే ఉంటాం. వీసా అనేది హక్కు కాదు, అదొక ప్రత్యేక సౌకర్యం మాత్రమే.**

- మార్కో రూబియో,
అమెరికా విదేశాంగ శాఖ మంత్రి

*పాక్‌తో జరిగిన యుద్ధంలో ఎవరు, ఎంత మేరకు నష్టపోయారనే చర్చ జరుగుతున్న వేళ దాయాదిని భారత్ తీవ్రంగా నష్టపరిచినట్టు స్పష్టమైంది. భారత దళాలు సాంకేతికతలో, వైమానిక శక్తిలో ఆధిక్యతను చాటాయి. భవిష్యత్తులో తమపై ఉగ్రదాడి జరిగితే భారీ మూల్యం చెల్లించేలా చేస్తామన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పాన్ని మన దళాలు నిరూపించాయి.*

# గెలిచింది సైన్యమే..



అవయ్ శుక్లా



ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరులో భారత్‌కు అంతర్జాతీయంగా ఎందుకు మద్దతు లభించలేదు? పహల్గాం ఉగ్రదాడి తర్వాత వచ్చిన సింపతీ అతి తక్కువ సమయంలోనే ఎందుకు సన్నగిల్లింది? పాక్‌కు చైనా, టర్కీ, అజర్‌బైజాన్‌లు తోడుగా నిలిచినట్టు.. కీలకమైన ఆ నాలుగు రోజుల పాటు ఏ దేశమూ మనకు ఎందుకు మద్దతుగా నిలవలేదు? అణ్వాయుధాలతో పాక్ బెదిరింపులకు దిగినప్పటికీ ఐఎంఎఫ్ మరోసారి బిలియన్ డాలర్ల రుణం ఎందుకు ప్రకటించింది? ఇలాంటి ప్రశ్నలెన్నో ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉత్పన్నమవుతున్నాయి.

మే 13న కరణ్‌థాపర్‌తో జరిగిన ఇంటర్వ్యూలో మాజీ మంత్రి, సీనియర్ జర్నలిస్టు అరుణ్ శౌరి చెప్పినట్టుగా.. అంతర్జాతీయంగా మన విశ్వసనీయతను భారతీయ మీడియా తీవ్రంగా దెబ్బతీసింది. తత్ఫలితంగా అంతర్జాతీయంగా జరిగిన అభిప్రాయ యుద్ధం (పర్సెప్షన్ వార్)లో మనం ఓడిపోయాం. అరుణ్ శౌరి అభిప్రాయపడినట్టు.. ఓ వర్గం మీడియా (ప్రత్యేకించి న్యూస్ చానళ్లు) 'ఒక దేశానికి వ్యతిరేకంగా నేరం' అన్నట్టుగా రిపోర్టింగ్ చేశాయి. ఉగ్రవాదులు, పాక్, ముస్లింలను ఒకే గాటన కట్టి నాలుగైదు చానళ్లు వాస్తవాన్ని వక్రీకరించి కథనాలను వండివార్చాయి. తద్వారా దేశంలోని రెండు అతిపెద్ద సమాజాల మధ్య సంఘర్షణను మరింతగా పెంచాయి.

ఆయా చానళ్ల యాంకర్లు ఉపయోగించిన భాష కూడా అసభ్యకరంగా ఉంది. ఓ చానల్‌లో ఒక వీడియో క్లిప్ ప్రసారమైంది. అందులో తనను తాను రిటైర్డ్ మేజర్‌గా చెప్పుకొన్న ఓ వ్యక్తి.. మన దేశానికి వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన ఓ ఇస్లామిక్ దేశ విదేశాంగ మంత్రిని తీవ్ర పదజాలంతో దూషించారు. ఆయన వాడిన అభ్యంతరకరమైన మాటను సదరు టీవీ స్క్రీన్‌పై చాలాసేపు చూపించారు. ఇది ముమ్మాటికీ విదేశాలతో శత్రుత్వాన్ని సృష్టించడమే. తీవ్ర నేరం కూడా. కానీ, ఆ యాంకర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీని పర్యవసానంగా రెండు మూడు రోజుల తర్వాత సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ లాంటి దేశాలు పాక్‌కు ఐఎంఎఫ్ రుణం మంజూరుకు మద్దతిచ్చాయి.

యుద్ధ సమయంలో మీడియా అన్ని పరిమితులను దాటివేసింది. యుద్ధ రిపోర్టింగ్ అబద్ధాలు, యుద్ధోన్మాదంతో నిండిపోయింది. టీవీ చానళ్ల స్టూడియోలు తప్పుడు కథనాల వార్ రూమ్‌లుగా మారిపోయాయి. కల్పిత కథనాలను మీడియా ప్రసారం చేశాయి. గంటగంటకూ తప్పుడు కథనాలను ప్రసారం చేసి గందరగోళం, భయాందోళనలు సృష్టించాయి. వాస్తవాలను ప్రసారం చేసి దేశంలో నెలకొన్న పరిస్థితులను చల్లార్చకుండా.. శాంతి ఒప్పందం జరిగిన వారం తర్వాత కూడా యుద్ధోన్మాదాన్ని కొనసాగించాయి.

భారత్‌కు దౌత్యపరంగా ఇబ్బందులు ఎదురవడానికి, అంతర్జాతీయంగా ఒంటరిగా మారడానికి విదేశాంగ శాఖ మంత్రిగా జైశంకర్ విఫలమవడమే ప్రధాన కారణం. అతని దూకుడు, మన కంటే ఉన్నత స్థాయిలోని దేశాలతో మాట్లాడే విధానం, విశ్వగురు ఆశయాలు అంతర్జాతీయ అంశాల్లో మన స్థాయికి సరిపోలవని గుర్తించేందుకు నిరాకరించడం, ప్రజాస్వామ్యాన్ని గుర్తించడంలో అసమర్థత, అవకాశవాదం కలగలిసి.. ప్రపంచ దేశాలు మన రాజకీయాలను, మన విధానాలను అనుమానించడానికి, మన నుంచి దూరం కావడానికి దారితీశాయి. మన పొరుగు దేశాల్లోనూ మనకు మిత్రులు లేరని పాకిస్థాన్ యుద్ధం స్పష్టం చేసింది.

ప్రపంచం ఇలాంటి ఘటనలను గమనించి భారతదేశం నుంచి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నది. ఈ నేపథ్యంలోనే ఉగ్రవాదం అనే ప్రధాన కారణం వెనక్కి వెళ్లిపోయి.. హిందూ భారత్ వర్సెస్ ఇస్లామిక్ పాకిస్థాన్ అనే నెరేటివ్ తెరపైకి వచ్చింది. రాజకీయ, మీడియా వైఫల్యాల వల్ల యుద్ధభూమిలో మన సైనికులు సాధించిన విజయాలు వృథా అయ్యాయి. అవకాశవాదం, మానవ హక్కుల అణచివేత, విద్వేషం, మత జాతీయవాదంలో కూరుకుపోయిన దేశం.. నైతికంగా ఉన్నత స్థానాన్ని, అంతర్జాతీయ మద్దతును ఆశించడం కుదరదు. దీని కోసం కాదు మన సైనికులు పోరాడింది. మన సైనికులు గెలిచారు, కానీ ఒక దేశంగా మనం వారిని తీవ్రంగా నిరాశపరిచాం.

**(వ్యాసకర్త: రిటైర్డ్ ఐఏఎస్)**